RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు



హైదరాబాద్‌ను
గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం

నగరాభివృద్ధికి యాదవుల సహకారం కావాలి: సీఎం రేవంత్

సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా.. రూ.5 కోట్ల నిధులు

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, నవంబరు 5, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 176 | పేజీలు: 8 | వెల : రూ.1

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

రైతుల సమక్షంలోనే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే

వచ్చే ఏడాదిలోగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలని లక్ష్యం

క్షేత్రస్థాయి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారి సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, భూ యజమానులకు భద్రతతో కూడిన వివాదరహిత రికార్డులు, పాస్‌బుక్కులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ అంశాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమగ్ర భూ సర్వేను చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా చేపడతామని తెలిపారు. సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్లు కనీసం వారానికి ఒకరోజు సర్వే జరుగుతున్న గ్రామాలను సందర్శించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు, మార్గదర్శకాలపై అధికారులు స్పష్టమైన వివరాలు అందించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా వాస్తవ పరిస్థితులను తెలియజేస్తే సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేసి పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని, ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు ఈ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. 22-ఏ జాబితాకు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని అంశాలుంటే వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాంలపై విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలి

వచ్చే విద్యా సంవత్సరం నుంచే పక్కా కార్యాచరణ రూపొందించాలి

పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాంలు, కిట్లు అందేలా చర్యలు


పంపిణీ పూర్తికాని వస్తువులను త్వరగా అందించాలని సీఎం ఆదేశం



హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అందించిన స్కూల్ యూనిఫాంలపై వారి అభిప్రాయాలను సేకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా భవిష్యత్తులో యూనిఫాంల రంగులు, డిజైన్లను ఎంపిక చేసేందుకు ఈ అభిప్రాయాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గతంతో పోలిస్తే ఈసారి మెరుగైన నాణ్యతతో, ఆకర్షణీయమైన రంగులు, డిజైన్లతో యూనిఫాంలు అందించినట్లు అధికారులు వివరించారు. యూనిఫాంలతో పాటు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు, సాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, కార్పెట్లు, స్కూల్ బ్యాగుల పంపిణీ దాదాపు పూర్తయినట్లు తెలిపారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని వివరించారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా విద్యార్థులకు అందించాలని సీఎం సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీకి అవసరమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్‌వోపీ) ఇప్పటి నుంచే రూపొందించాలని ఆదేశించారు. వస్తువుల జాబితా ఖరారు, టెండర్ల ప్రక్రియ, సరఫరా, పంపిణీ వరకు ప్రతి దశకు నిర్దిష్ట గడువులు నిర్ణయించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు యూనిఫాంలతో పాటు అవసరమైన సామగ్రి మొత్తం అందేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, గిరిజన, వెనుకబడిన తరగతుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా తదితర అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో జనసేనకు 100 శాతం స్ట్రైక్ రేట్



విజయవాడ, నవంబర్ 4: ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తాను పోటీ చేసిన అన్ని మేయర్, చైర్‌పర్సన్ స్థానాలను గెలుచుకుంది. టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా జనసేనకు కేటాయించిన స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులంతా విజయం సాధించారు. దీంతో పార్టీ 100 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేసినట్లయింది. కూటమి ఒప్పందం ప్రకారం జనసేనకు నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలు కేటాయించారు. వీటిలో ప్రస్తుతం విజయవాడ, ఏలూరు కార్పొరేషన్లతో పాటు 15 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 20 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులు గెలుపొందారు. మిగిలిన రెండు కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది.

విజయవాడ, ఏలూరులో కీలక విజయం

విజయవాడ మేయర్ స్థానానికి జనసేన తరఫున పోటీ చేసిన వంగవీటి రాధాకృష్ణ విజయం సాధించారు. ఏలూరు మేయర్ స్థానంలో రెడ్డి అప్పలనాయుడు గెలుపొందారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లోని ఈ రెండు మేయర్ స్థానాలను దక్కించుకోవడం జనసేనకు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. విజయవాడలో కూటమి భాగస్వామ్య పార్టీల అభ్యర్థులు కూడా పలు డివిజన్లలో విజయం సాధించారు.

పిఠాపురంలో జనసేనకు ఆధిక్యం

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనూ పార్టీకి అనుకూల ఫలితాలు వచ్చాయి. పిఠాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దానం లాజర్‌బాబు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై 9,235 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 36 వార్డుల్లో మూడు స్థానాలు జనసేనకు ఏకగ్రీవం కాగా, ఎన్నికలు జరిగిన వార్డుల్లో జనసేన 16, టీడీపీ ఐదు, బీజేపీ ఒకటి, వైఎస్సార్‌సీపీ ఒకటి గెలుచుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు పది చోట్ల విజయం సాధించారు. వారిలో ఎనిమిది మంది కూటమి రెబల్స్‌గా పోటీ చేసినవారని ఎన్నికల వివరాలు పేర్కొంటున్నాయి.

గెలుపొందిన చైర్‌పర్సన్ అభ్యర్థులు

జనసేన తరఫున వివిధ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో విజయం సాధించిన అభ్యర్థులు:

- అమలాపురం -- నల్లా శ్రీధర్
- పిఠాపురం -- దానం లాజర్‌బాబు
- తుని -- శరగణం శ్రీలత
- ముమ్మిడివరం -- గుబ్బల గంగా రత్నభవాని
- గొల్లప్రోలు -- కడారి తమ్మయ్య నాయుడు
- సామర్లకోట -- పిట్టా జానకి రామారావు
- నరసాపురం -- కొత్తపల్లి శైలజ
- నిడదవోలు -- మురాల జ్యోతి
- పెడన -- నాగలింగ జ్యోత్స్న రాణి
- తెనాలి -- తోటకూర వెంకట రమణారావు
- చిలకలూరిపేట -- తోట రాజరాజేశ్వరి
- తిరువూరు -- పి. మాధవి
- పుట్టపర్తి -- ఎం. ఈశ్వర్
- మడకశిర -- గుండుమల శారద
- దర్శి -- దారం సుబ్బారావు
- పుత్తూరు -- డి. ఏలుమలై
- సాలూరు -- గొర్లె విజయకుమారి
- పాలకొండ -- చల్లా విజయ నిర్మల

స్థానికంగా పార్టీ బలంపై చర్చ

2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేసిన అన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. తాజాగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కేటాయించిన అన్ని స్థానాలను గెలుచుకోవడంతో పార్టీ నాయకత్వం, శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. స్థానిక సంస్థల్లో లభించిన ఈ ఫలితాలు పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని విస్తరించుకునేందుకు దోహదపడతాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే మిగిలిన స్థానాలకు ఎన్నికలు పూర్తయిన తర్వాతే కూటమిలో జనసేనకు కేటాయించిన మొత్తం స్థానాలపై పూర్తి స్పష్టత రానుంది.

హిందూ కాలేజీ ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటాం

విద్యార్థుల ఆందోళనకు కల్వకుంట్ల కవిత మద్దతు

నెలన్నరగా నిరసనలు కొనసాగుతున్నా కేంద్రం స్పందించడం లేదని విమర్శ

విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతమవుతుందని హెచ్చరిక



న్యూఢిల్లీ: ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రతిష్ఠాత్మక హిందూ కాలేజీ ప్రైవేటీకరణ ప్రయత్నాలను సహించబోమని తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాలేజీ చారిత్రక వారసత్వం, ప్రత్యేక గుర్తింపును కాపాడేందుకు ఆందోళన చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులకు ఆమె మద్దతు ప్రకటించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం హిందూ కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులను కవిత కలిశారు. వారి ఆందోళనకు సంఘీభావం ప్రకటించి, న్యాయబద్ధమైన పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సుమారు 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విద్యాసంస్థ ఎందరో మేధావులను తీర్చిదిద్దిందని, దాని వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కాలేజీ నిర్వహణకు నిధులు అందిస్తున్న ప్రైవేటు సంస్థలకు దాని నిర్వహణపై నియంత్రణ కల్పించడం సమంజసం కాదని కవిత అభిప్రాయపడ్డారు. యూజీసీ నిబంధనల ప్రకారం విరాళాలు అందించే సంస్థలకు పరిమిత సదుపాయాలు మాత్రమే కల్పించాలని సూచించారు. నిధుల కొరత పేరుతో కాలేజీని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

కేంద్రం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది నెలన్నరగా నిరసనలు కొనసాగిస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై కవిత ప్రశ్నించారు. కాలేజీ ప్రవేశాల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, ప్రైవేటీకరణ ప్రయత్నాలపై విద్యార్థులు లేవనెత్తుతున్న సందేహాలకు కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను పట్టించుకోకుండా వారి గొంతును అణచివేయాలని చూస్తే నిరసనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని కేంద్రానికి సూచించారు. చట్టబద్ధంగా జరిగే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని, హిందూ కాలేజీ విద్యార్థుల ఆందోళన న్యాయసమ్మతమైనదని కవిత పేర్కొన్నారు.

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

క్రీడాకారులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఖేలో ఇండియా నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్బీ స్టేడియంలో ఆధునిక టెన్నిస్ కాంప్లెక్స్ ప్రారంభం



హైదరాబాద్: తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, రాష్ట్రంలో క్రీడా రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎల్బీ స్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను సహచర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు రావడం గర్వకారణమని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని చెప్పారు. సీఎం కప్‌తో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న స్టేడియాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్ ద్వారా తెలంగాణను దేశంలోనే స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా ఖేలో ఇండియా నిర్వహణ విజయవంతానికి అన్ని శాఖల నుంచి పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మెట్రో వాటర్ వర్క్స్, పోలీసు శాఖ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్రీడా పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లోనూ ఖేలో ఇండియా పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రీడలను హైదరాబాద్, జిల్లా కేంద్రాలకే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల క్రీడాకారులకు అవకాశాలు కల్పించాలని మంత్రి సూచించారు. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ వంటి సంస్థలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే అపోహ నుంచి యువత బయటపడాలని, క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఉన్నత విద్యలో ప్రవేశ అవకాశాలు ఉంటాయని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్రీడాకారుల విజయాల వెనుక క్రీడా ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించి తెలంగాణకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఖేలో ఇండియా నిర్వహణలో తెలంగాణ ఆతిథ్యాన్ని దేశమంతా ప్రశంసించేలా మంత్రులు, అధికారులు, క్రీడా సంఘాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీప్రసాద్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోనిబాలాదేవి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, శంకర్ గీతా కార్పొరేషన్ చైర్మన్, జంగా రాఘవరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం

నగరాభివృద్ధికి యాదవుల సహకారం కావాలి: సీఎం రేవంత్

సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా.. రూ.5 కోట్ల నిధులు




హైదరాబాద్, నవంబర్ 4:లి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేసి, దేశంలోనే ఆదర్శనగరంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి యాదవులు సంపూర్ణ సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులతో నగర అభివృద్ధికి మరింత ఊతమిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల కృషి, నగర శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర కీలకమని సీఎం ప్రశంసించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారిని ఆదరించి అక్కున చేర్చుకోవడంలో యాదవులు ముందుంటారని అన్నారు. యాదవుల ఆత్మగౌరవం, హక్కులకు భంగం కలగకుండా చూసే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళన్‌ను అధికారికంగా నిర్వహించలేదని పేర్కొన్న సీఎం.. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యాదవుల విజ్ఞప్తి మేరకు సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని తెలిపారు. ఈ వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. కులగణన ద్వారా జనాభా నిష్పత్తికి అనుగుణంగా సామాజిక వర్గాలకు వాటా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. యాదవులకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించామని పేర్కొన్నారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా నియమించడంతో పాటు గోశాల బాధ్యతలు కూడా అప్పగించినట్లు గుర్తుచేశారు. బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి యాదవ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, మల్లు రవి, ధర్మేంద్ర యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సదర్ ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొలంబో పోర్టులో 150కి పైగా మిర్చి కంటైనర్లు నిలిపివేత

తేమ శాతం ఎక్కువగా ఉందంటూ దిగుమతికి పలు దేశాల అభ్యంతరం

రూ.60 కోట్ల విలువైన సరుకు నిలిచిపోవడంతో రైతులు, ఎగుమతిదారులకు నష్టం

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు లేఖ



అమరావతి: మిర్చి రైతులు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శ్రీలంకలోని కొలంబో పోర్టులో నిలిచిపోయిన 150కి పైగా మిర్చి కంటైనర్లను సంబంధిత దేశాలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు బుధవారం లేఖ రాశారు. చైనా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాలకు ఎగుమతి కావాల్సిన మిర్చి కంటైనర్లు కొలంబో పోర్టులో చిక్కుకుపోయాయని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. మిర్చిలో తేమ శాతం నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువగా ఉందంటూ ఆయా దేశాలు సరుకును స్వీకరించేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. దీంతో సుమారు రూ.60 కోట్ల విలువైన మిర్చి సరుకు పోర్టులోనే నిలిచిపోయిందని, ఈ పరిస్థితి రైతులు, ఎగుమతిదారులకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సరుకు నిలిచిపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సంబంధిత దేశాలతో దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. నిలిచిపోయిన మిర్చి కంటైనర్లను స్వీకరించేలా ఆయా దేశాలను ఒప్పించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తద్వారా రైతులు, ఎగుమతిదారులకు ఆర్థికంగా ఊరట కల్పించాలని లేఖలో పేర్కొన్నారు.

ట్రంప్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

20 వేల మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న అభ్యర్థన తిరస్కరణ



న్యూయార్క్, నవంబర్ 5:లి అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ప్రభుత్వ అభ్యర్థనను ఫెడరల్ కోర్టులతో పాటు సుప్రీంకోర్టు కూడా తిరస్కరించింది. కాలిఫోర్నియాలోని సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది. వారు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపిస్తూ, సంబంధిత బ్యాలెట్లను పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది. అయితే ప్రభుత్వ అభ్యర్థనను కాలిఫోర్నియా వ్యతిరేకించింది. ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందని, లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారని తెలిపింది. ట్రంప్ ప్రభుత్వం సమర్పించిన జాబితాలో తప్పులు ఉన్నాయని, అందులో అమెరికా పౌరుల పేర్లు కూడా ఉన్నాయని వాదించింది. ఈ వ్యవహారంపై ట్రంప్ ప్రభుత్వం తొలుత ఫెడరల్ జిల్లా కోర్టును ఆశ్రయించగా, అక్కడ చుక్కెదురైంది. అనంతరం 9వ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టులోనూ 2-1 మెజారిటీతో ప్రభుత్వ అభ్యర్థన తిరస్కరణకు గురైంది. బ్యాలెట్లను పక్కన పెడితే అర్హులైన ఓటర్లు వేసిన ఓట్లు కూడా చెల్లకుండా పోయే ప్రమాదం ఉందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. దీంతో నవంబర్ 2న ట్రంప్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి, వివాదాస్పద బ్యాలెట్లను తాత్కాలికంగా పక్కన పెట్టాలని కోరింది. అయితే అత్యున్నత న్యాయస్థానం కూడా ఆ అభ్యర్థనను తిరస్కరించడంతో ట్రంప్ ప్రభుత్వానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య పెంచాలి

మంజూరైన వెయ్యి పోస్టులనూ భర్తీ చేయాలి..
జీఓ 31లో యూజీసీ నిబంధనలకు
అనుగుణంగా మార్పులు చేయాలి



నాచారం (వాయిస్ టుడే): రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్య పెంచడంతో పాటు, మంజూరైన వెయ్యి పోస్టులనూ భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీడీఏ) డిమాండ్ చేసింది. కేవలం 429 పోస్టుల భర్తీతో సరిపెట్టకుండా, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని కోరింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌లకు అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన జీఓ నంబర్ 31లోని నియామక మార్గదర్శకాలను యూజీసీ 2018 నిబంధనలకు అనుగుణంగా సవరించాలని విజ్ఞప్తి చేశారు. యూజీసీ పరిశోధన ప్రాజెక్టులు, స్వయం, ఎంఓఓసీ కోర్సుల రూపకల్పన, జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉపన్యాస అవకాశాలు ప్రధానంగా శాశ్వత అధ్యాపకులకే లభిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల తాత్కాలిక అధ్యాపకులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు అన్యాయం జరిగే అవకాశముందని పేర్కొన్నారు. నియామకాల్లో ప్రతిభ ఆధారంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. విశ్వవిద్యాలయాల నియామకాలకు ప్రత్యేక కేంద్ర ఆన్‌లైన్ దరఖాస్తు విధానం ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించేలా ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించాలని కోరారు. 33 జిల్లాల్లోని పాఠశాలల వివరాల ఆధారంగా స్థానికతను నిర్ధారించాలని తెలిపారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులను 1:25 నిష్పత్తిలో పిలవాలని ప్రతిపాదించారు. దరఖాస్తులు, ఏపీఐ స్కోర్ల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, సందేహాలున్న దరఖాస్తులను తిరస్కరించకుండా వివరణ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్వ్యూలకు కనీసం నెల రోజుల ముందే దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల తనిఖీ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీఏ సలహాదారు డాక్టర్ పి. రమణరావు, అధ్యక్షుడు డాక్టర్ పి. నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ తిరుపతి బొల్లం, డాక్టర్ రామానాయుడు, డాక్టర్ స్వామి నాయక్, డాక్టర్ మహేందర్, డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్
కలరిపయట్టు క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరం

నాచారం (వాయిస్ టుడే):రానున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'ను పురస్కరించుకుని ఇండియన్ కలరిపయట్టు ఫెడరేషన్, కలరిపయట్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఖూూ+) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ప్రాంగణంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. క్రీడాకారులలో నైపుణ్యాలు పెంచడం, పోటీ నిబంధనలు మరియు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ శిబిరం సాగింది. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు తుది ఎంపికకు ముందు తదుపరి విస్తృత శిక్షణలో పాల్గొంటారు. అంతేకాకుండా, నవంబర్ 27 నుంచి 29 వరకు తిరువనంతపురంలో జరిగే 19వ జాతీయ కలరిపయట్టు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం కూడా వీరికి లభిస్తుంది. ఈ శిక్షణ శిబిరాన్ని ఐ కె ఎఫ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబు ఆర్. నాయర్, సాంకేతిక అధికారులు శ్రీజయన్ పి.ఈ. గురుక్కల్, అంబరీష్ గురుక్కల్ మరియు కే ఏ టి జి ప్రతినిధుల మార్గదర్శకత్వంలో నిర్వహించారు. తెలంగాణలో కలరిపయట్టు అభివృద్ధికి, యువ ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ శిబిరం ఒక ముఖ్యమైన ముందడుగు అని కే ఏ టి జి జాయింట్ సెక్రటరీ రాఘవ్ ముకుంద్ తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ఐ కె ఎఫ్ నాయకత్వానికి, కే ఏ టి జి అధ్యక్షురాలు ధనలక్ష్మి మహాదేవ్, కార్యదర్శి టి. రమేష్, కోశాధికారి డా. ఆది భవాని శంకర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



పట్టభద్రులందరూ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి :నవంబర్ 4(వాయిస్ టుడే): రానున్న హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ రావు అధ్యక్షతన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పట్టభద్రులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా నిర్దీత గడువులోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాన్ని ప్రతిబింబించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రతి డివిజన్‌లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కన్వీనర్ శంకర్ రెడ్డి, కో-కన్వీనర్ వినయ్, కొమ్ము ప్రభాకర్, ప్రశాంత్ రావు, రాహుల్ తేజ, శేఖర్ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో ఆర్ఆర్ఆర్ డిజిటల్ ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన బండి రమేష్



కూకట్‌పల్లి: నవంబర్ 4(వాయిస్ టుడే) కూకట్‌పల్లి 4వ ప్లేస్‌లో హనుమంతు, రమేష్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ డిజిటల్ ప్రింటింగ్ ప్రెస్'ను టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ నూతనంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన హనుమంతు, రమేష్‌లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని, వినియోగదారుల ఆదరణతో మంచి పేరు సంపాదించుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్థానికంగా నూతన వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశాలు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేష్, రాజేష్ శంకర్, అరవింద్ రెడ్డి, కరుణాకర్, రంగమోహన్, అబ్దుల్లా, లక్ష్మణ్ గౌడ్, బాలరాజ్, రమేష్, వినోద్, సుజాత, బాబ్జి, బచ్చు మల్లీ, రవి తదితరులు పాల్గొన్నారు.



యాదవుల ఐక్యతకు చిహ్నంగా సదర్ వేడుకలు

తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, నవంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): యాదవుల ఐక్యతకు చిహ్నంగా సదర్ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం చీ= స్టేడియం వద్ద మాజీ పార్లమెంటు సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 364 రోజులు నిత్యం తమ వృత్తి పారిపరిశ్రమ పనులలో నిమగ్నమై ఉండే యాదవులు దీపావళి మరుసటి రోజు సదర్ ను జరుపుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. ఒకప్పుడు హైదరాబాద్ కు మాత్రమే పరిమితమైన సదర్ ను ఇప్పుడు రాష్ట్రంలో ని అనేక ప్రాంతాల్లో నే కాకుండా పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. రామాయణం, మహాభారతం ఏ చరిత్ర చూసిన యాదవులు లేనిదే లేదన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మొదటగా తెరిచేది కూడా యాదవుడే అని ఆయన పేర్కొన్నారు. సంఖ్యాపరంగా ఎంతో బలమైన సామాజిక వర్గంగా ఉన్న యాదవులు ఐక్యతగా నిలిచి రానున్న రోజుల్లో రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు.

ఎంపీ వద్దిరాజును సన్మానించి జ్ఞాపిక అందజేత

ఖమ్మంలో 32వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు

ఖమ్మం (వాయిస్ టుడే ప్రతినిధి): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను సుమన్ షాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే డూ అకాడమీ ఇండియా చీఫ్ ఆర్గనైజర్ జల్లెల శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం ఖమ్మంలోని బురహాన్‌పురంలో ఉన్న ఎంపీ క్యాంపు కార్యాలయంలో రవిచంద్రను కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తండ్రి స్వర్గీయ నారాయణ జ్ఞాపకార్థం జల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఖమ్మం వర్తక సంఘం ఆవరణలో 32వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రముఖ సినీ నటుడు, కరాటే గ్రాండ్ మాస్టర్ సుమన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు సహకరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రను జల్లెల శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలంశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కాంగ్రెస్ దృష్టి
మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌లో ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఉప్పల్‌లోని వీటి కమాన్ వద్ద బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు గారి ఆధ్వర్యంలో, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన వారు భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఈగ అంజయ్య ముదిరాజ్,బాకారం లక్ష్మణ్,ఎస్ సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి,తుమ్మల రాజేందర్ రెడ్డి, భూత్కూర్ రాజు,కంచమిది శ్రీనివాస్,గొరిగే మహేష్,అలుగుల అనిల్ కుమార్,మహంకాళి రాజు,నవీన్,రంగుల శేఖర్ ముదిరాజ్, బకారం అరుణ్,జనగామ రామకృష్ణ, అల్వాలా భాస్కర్, అన్వార్ పాషా, సబ్బా రెడ్డి, కడప నర్సింగ్ రావు,బజార్ నవీన్ గౌడ్,బోడిగే మల్లేష్,నోముల సురేష్,మహేందర్ రెడ్డి,విజయ్ గుప్తా, కుశంగళ సతీష్,తైసీన్,సత్తి,వెంకటేష్ సెట్, కుయ్య శ్రీనివాస్,మమతా,కుమార్, ప్రశాంత్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వం కేటాయించిన ధరలకే బియ్యం విక్రయించాలి: ఉప్పల్ ఏఎస్ఓ సంధ్య

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ సివిల్ సప్లై అధికారిణి సంధ్య బియ్యం వ్యాపారులను హెచ్చరించారు. తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల బియ్యానికి ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. బీపీటీ, కేఎన్ఎం రకం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ (తెలంగాణ సోనా) రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం రూ.79గా ధరలు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బియ్యం 26 కిలోల ప్యాక్‌లలో అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారం రామంతాపూర్‌లోని బియ్యం దుకాణాలను సంధ్య తనిఖీ చేశారు. ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేయడంతో పాటు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు స్థానికంగానే డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలో 6 ఇయర్స్ నుండి నడుస్తుంది అని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరితగతిన కేటాయించి, కళాశాల ఏర్పాటుకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.

VOICE OF PRAJALU
వాయిస్ ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
గురువారం 5 నవంబరు 2026

బీసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్ పోరాటం

జీవో 14ను వెంటనే ఉపసంహరించుకోవాలి..
బీసీలను అణచివేసే కుట్ర: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్ (వాయిస్ టుడే ప్రతినిధి): బీసీల న్యాయమైన హక్కుల సాధనకు, రాజ్యాధికారంలో సముచిత వాటా కోసం, వారి ఆత్మగౌరవ పరిరక్షణకు బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 14 బీసీల హక్కులకు భంగం కలిగించేలా ఉందని ఒక ప్రకటనలో ఎంపీ విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం కోకాపేటలో 41 బీసీ కులాలకు కోట్లాది రూపాయల విలువైన 82 ఎకరాల భూమిని కేటాయించారని గుర్తుచేశారు. ఆ భూముల నిర్వహణలో ప్రభుత్వ జోక్యం లేకుండా కుల సంఘాల ఆధ్వర్యంలో ట్రస్టులు ఏర్పాటు చేయించారని తెలిపారు.

అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 14 ద్వారా కుల సంఘాలు, ట్రస్టులు, ఆత్మగౌరవ భవనాలపై ప్రభుత్వ నియంత్రణ పెంచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కుల సంఘాల ట్రస్టులను రద్దు చేసి విలువైన భూములపై ఆధిపత్యం సాధించాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు. కుల సంఘాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఈ నిర్ణయం ఉందన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం, కులగణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ కల్పించడం వంటి కీలక డిమాండ్లు ఇంకా నెరవేరలేదని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరుకాపు, యాదవ, కుర్మ, పద్మశాలి, చాకలి, మంగలి తదితర బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం విచారకరమన్నారు.

కేసీఆర్ పాలనలో బీసీలకు సముచిత గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం లభించిందని రవిచంద్ర పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని గుర్తుచేశారు. తెలంగాణ తొలి అసెంబ్లీ స్పీకర్‌గా మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్‌గా స్వామిగౌడ్, మంత్రులుగా జోగు రామన్న, గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్‌లకు అవకాశం కల్పించారని వివరించారు. హైదరాబాద్ మేయర్లుగా బొంతు రామ్మోహన్, గద్వాల విజయలక్ష్మీల నియామకాన్ని ప్రస్తావించారు. తనకు రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించడంతో పాటు కే.కేశవరావు, డి.శ్రీనివాస్, బండా ప్రకాష్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్‌లను పెద్దల సభకు పంపించి గౌరవించారని కేసీఆర్‌ను కొనియాడారు. కుటుంబ సర్వేలో బీసీల జనాభాను తక్కువగా చూపించారనే ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి బయటపడిందని ఆయన విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన 56 హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించారు. శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో అధికార పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఇద్దరూ అగ్రవర్ణాలకు చెందినవారేనని వ్యాఖ్యానించారు. జీవో 14 ద్వారా కుల సంఘాలను పక్కనపెట్టి, ట్రస్టులను రద్దు చేసి వాటి స్థానంలో భవన నిర్మాణ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ ఆధిపత్యాన్ని పెంచుకునే ప్రయత్నం జరుగుతోందని ఎంపీ ఆరోపించారు. బీసీ కులాల స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఉన్న జీవో 14ను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ బీసీల పట్ల వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించిన ఆయన, బీసీల న్యాయమైన హక్కుల సాధన, రాజకీయ అధికారంలో తగిన వాటా, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



కూచిపూడి నృత్యంలో చిన్నారి రుంకు వైష్ణవి ప్రపంచ రికార్డుల మోత!

6 గంటలపాటు నిర్విరామ ప్రదర్శన.. 12 ప్రపంచ రికార్డులు సొంతం

బాలిక ప్రతిభను అభినందించిన జనసేన నేతలు రామ్ తాళ్లూరి, నేమూరి శంకర్ గౌడ్

హైదరాబాద్ (వాయిస్ టుడే ప్రతినిధి): చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను చాటుతూ కూచిపూడి నృత్యంలో 12 ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్న బాలనృత్య కళాకారిణి రుంకు వైష్ణవిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం 12 ఏళ్ల వయసులో ఆరు గంటలపాటు ఎలాంటి విరామం లేకుండా 122 నృత్య భంగిమలు, 522 గణేశ గానాలతో 12 కిలోమీటర్ల మేర కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి రికార్డులు సాధించడం విశేషం. చిన్నారి వైష్ణవి అసాధారణ ప్రతిభను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ అభినందించారు. ఆమె తల్లిదండ్రులు రుంకు సాయి కుమారి, సాయికృష్ణలను ప్రత్యేకంగా ప్రశంసించారు. వైష్ణవి జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకుడు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన రుంకు సాయికృష్ణ కుమార్తె. కొరియోగ్రాఫర్ డాక్టర్ నామాని రవికుమార్ ప్రోత్సాహంతో ఆమె ఈ అద్భుత నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఇటీవల నిర్వహించిన అభినందన కార్యక్రమంలో జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, అల్లాడి తనీష్, మచ్చ సుధాకర్, నందగిరి సతీష్ కుమార్, తాటికొండ లిఖిత, మూల హరీష్ గౌడ్, కార్తీక్ నాయుడు, జీవన్, దుర్గ ప్రసాద్, ప్రవీణ్, యేరు కొండ రాజు, కుప్ప శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొని వైష్ణవిని అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారి వైష్ణవి మాట్లాడుతూ.. తన నానమ్మ రుంకు కళావతి, తాతయ్య రుంకు రాంబాబు, అమ్మమ్మ రమణమ్మ, తాతయ్య ఇజ్జడ రాంబాబు ఆశీర్వాదంతోనే ఈ ఘనత సాధించానని తెలిపింది. తనను ప్రోత్సహించిన గురువులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపింది.



ఉస్మానియా వర్సిటీ బోధనేతర సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

వర్సిటీ పాలనా వైఫల్యం వల్లే ఉద్యోగులు రోడ్డెక్కే దుస్థితి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

సమ్మె చేస్తున్న సిబ్బందికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ సంఘీభావం

హక్కులడిగితే బెదిరింపులు, సస్పెన్షన్లా?

విసి ఏకపక్ష వైఖరి వీడాలి







సికింద్రాబాద్, నవంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ సమాజానికి గుండెకాయ వంటి చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న బోధనేతర సిబ్బంది తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం అత్యంత బాధాకరమని, వారి న్యాయమైన డిమాండ్లకు భారతీయ జనతా పార్టీ పూర్తి సంఘీభావం ప్రకటిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఓయూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట ఓపీఎస్ అమలు, సర్వీసుల క్రమబద్ధీకరణ, హెల్త్ కేర్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లతో నిరసన తెలుపుతున్న నాన్ టీచింగ్, టెక్నికల్, టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ సిబ్బంది సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంతో తనకు, తన కుటుంబానికి ఉన్న విడదీయరాని అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఇదే వర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్బీ పూర్తి చేసి ప్రజా జీవితంలోకి వచ్చానని, తండ్రి ఇక్కడే ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారని తెలిపారు. సమాజ నిర్మాణానికి అవసరమైన శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, మేధావులు, రాజకీయ నాయకులను తీర్చిదిద్దిన ఒక గొప్ప విద్యా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం లేకపోవడం వర్సిటీ పరిపాలన వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పదేపదే తీర్పులు ఇస్తున్నా, వర్సిటీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 25, 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయకపోవడం దారుణమన్నారు. ఇతర యూనివర్సిటీల్లో వర్తింపజేస్తున్న ప్రయోజనాలను ఓయూలో ఎందుకు అమలు చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. వర్సిటీ ఖాతాల జప్తు పేరుతో ఏటా ఉద్యోగులకు రావాల్సిన రూ. 1500 ఇంక్రిమెంట్‌ను రద్దు చేసి, పిఎఫ్ పేరుతో వారి ఆర్థిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2001 నుంచి 2004 మధ్య నియమితులైన వారికి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, 2004 తర్వాతి వారికి సీపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడా లేని విధంగా ప్రవేశపెట్టిన ఎల్ఐసీ లింక్డ్ పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ. 10 వేల నుంచి రూ. 30 వేలకు పెంచాలని, అన్ని విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న అంతర్గత పదోన్నతులు, నోటిఫికేషన్లను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

హక్కుల కోసం నిలదీస్తే ఉద్యోగులను బెదిరించడం, నిరసన తెలిపిన వారిపై సస్పెన్షన్ వేట్లు వేయడం నియంతృత్వ పోకడలకు పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. గతంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న ప్రొఫెసర్ మనోహర్ పై తీసుకున్న సస్పెన్షన్ చర్యలపైనా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయ పాలన పూర్తిగా వైస్ ఛాన్సలర్ చేతుల్లోనే ఉంటుందని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రతిష్టాత్మక విద్యాసంస్థ బద్నాం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓయూ పూర్వ విద్యార్థిగా, ఓయూ లా కాలేజీ మాజీ అలూమ్ని ప్రెసిడెంట్‌గా వర్సిటీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం, వర్సిటీ ఉన్నతాధికారులు మొండివైఖరి వీడి సమ్మె చేస్తున్న బోధనేతర ఉద్యోగ జేఏసీ నాయకులను వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిబ్బంది పోరాటానికి బీజేపీ ప్రత్యక్షంగా అండగా నిలిచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు గారు, మాజీ ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నేతలు, పలు యూనివర్సిటీల నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఓయూ జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర సాంకేతికతల అభివృద్ధిలో ఫంక్షనల్ మెటీరియల్స్ కీలకం

ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి

అంతర్జాతీయ సదస్సులో 400 మంది ప్రతినిధుల హాజరు





సికింద్రాబాద్, నవంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): ఇంధన, పర్యావరణ సవాళ్లకు పరిష్కారాలను అందించడంలో వినూత్న ఫంక్షనల్ మెటీరియల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎస్ఐఆర్--ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. తార్నాక లోని ఐఐసీటీలో రెండు రోజుల 'ఇన్నోవేటివ్ ఫంక్షనల్ మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ 2026 అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ ఇంధనం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, పర్యావరణ పరిరక్షణ, అధునాతన తయారీ రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు పరిశోధనలు దోహదపడతాయని పేర్కొన్నారు. వివిధ శాస్త్ర విభాగాలకు చెందిన నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి పరిశోధనలు, ఆలోచనలను పంచుకోవడం ద్వారా సరికొత్త సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేయవచ్చన్నారు. దేశీయ సాంకేతికతల అభివృద్ధి, పరిశ్రమలు--విద్యాసంస్థల మధ్య సహకారం, పరిశోధనలను వాణిజ్యపరమైన ఉత్పత్తులుగా మార్చాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం ఈ సదస్సులో డాక్టర్ ఆర్. బాలమురళీకృష్ణన్, డాక్టర్ ఎస్.వి.ఎస్. నారాయణమూర్తి, ప్రొఫెసర్ టి. నరసింగరావు, పద్మశ్రీ డాక్టర్ సుభా వి. అయ్యంగార్ తదితరులు ఉపన్యాసాలు అందించారు. అరుదైన ఖనిజాలు, అయస్కాంత పదార్థాలు, నానో మెటీరియల్స్, బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు, సోలార్ సెల్స్, హైడ్రోజన్ ఇంధనం, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే సాంకేతికతలపై సదస్సులో చర్చిస్తున్నారు. రష్యా, జపాన్, ఇజ్రాయెల్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి

నిబంధనలు పాటించాలి

మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్

హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్ల యజమానులతో పోలీసుల సమావేశం

సికింద్రాబాద్, నవంబర్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి): నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, డార్మిటరీల యజమానులు, నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని మల్కాజిగిరి డీసీపీ డాక్టర్ శ్రీధర్ సూచించారు. ప్రతి వసతి గృహంలో నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో గోపాలపురం, మార్కెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, డార్మిటరీల యజమానులు, మేనేజర్లతో పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి డీసీపీ డాక్టర్ శ్రీధర్, ఏసీపీ యాదగిరిరెడ్డి హాజరై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి హోటల్, లాడ్జీ, హాస్టల్, డార్మిటరీ నిర్వాహకులు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడంతో పాటు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతి ప్రాంగణంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు.

హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లను సంఘటిత నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, ఇతర చట్టవ్యతిరేక చర్యలకు వేదికలుగా మారనివ్వకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా గంజాయి, ఇతర నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలకు చెందిన వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తులు తమ ప్రాంగణాల్లో బస చేసినట్లు గుర్తించినా, వారి ప్రవర్తన, కదలికలు అనుమానాస్పదంగా కనిపించినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. అలాగే హోటళ్లు, లాడ్జీలు, ఇతర వసతి గృహాల్లో బస చేసే ప్రతి ఒక్కరి వివరాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, పోలీసుల తనిఖీలు, విచారణల సమయంలో అవసరమైన సమాచారాన్ని అందించి సహకరించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల భద్రత, నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ అనేది పోలీసులతో పాటు వసతి గృహాల నిర్వాహకుల బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మధుకుమార్, మార్కెట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రామకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎస్ఐలు మాధవరావు, రవి నాయక్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సుమారు 100 హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు, ఇతర వసతి గృహాలకు చెందిన యజమానులు, మేనేజర్లు, సిబ్బంది హాజరయ్యారు.

సదర్ సమ్మేళనం తెలంగాణ ఆత్మగౌరవ వేడుక

యాదవుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి







హైదరాబాద్, నవంబర్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి): సదర్ సమ్మేళనం కేవలం యాదవ సామాజిక వర్గానికే పరిమితమైన వేడుక కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే గొప్ప ఉత్సవమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. యాదవుల ఆత్మగౌరవ పరిరక్షణతో పాటు రాజకీయ, సామాజిక రంగాల్లో వారికి తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. ఒకప్పుడు గోల్కొండ కోటను గొల్లకొండగా పిలిచేవారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యతకు సదర్ సమ్మేళనం ప్రతిబింబమని సీఎం అన్నారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు మరింత గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించామని, ఉత్సవాల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యం, అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించామని వివరించారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. యాదవుల ఆర్థిక, సామాజిక అభివృద్ధితో పాటు వారి ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మూసీ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రగతిలో అన్ని సామాజిక వర్గాల భాగస్వామ్యం అవసరమని, అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, అరవింద్‌కుమార్ యాదవ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారు హనుమంతరావు, శంకర్ యాదవ్, రమేష్ యాదవ్, రఘు యాదవ్, ప్రవీణ్ యాదవ్, మహేందర్ యాదవ్, ప్రసాద్ యాదవ్, దయానంద యాదవ్, మల్లేష్, రాకేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.



ఎంపీ వద్దిరాజు నిమ్స్‌లో మెరుగైన వైద్యం కోసం రూ. 2లక్షల ఎల్వోసీ అందజేత

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గణేశ్వరంకు వాస్తవ్యులు అజ్మీరా చిన్న ప్రసాద్ కూతురు లాస్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్నారు.ప్రసాద్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను కలిసి తన కూతురు ఆరోగ్య పరిస్థితిని గురించి వివరించారు.ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి నిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం కోసం సీఏంఆర్ఏఫ్ ద్వారా రూ.2 లక్షలు మంజూరు చేయించారు.ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోవీ)ను ఎంపీ వద్దిరాజు బుధవారం ఖమ్మం బురహాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో లాస్యశ్రీ తండ్రి చిన్న ప్రసాద్ కు అందజేశారు,ఈ సందర్భంగా ఆయన ఎంపీ రవిచంద్రకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అత్యవసర వైద్య సేవలు సిద్ధంగా ఉండాలి

రాయికల్ (వాయిస్ టుడే) : రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో నడిచే 108, 102 అత్యవసర సేవల అంబులెన్స్ లకు జిల్లా మేనేజర్ యశోద ఐలయ్య తనిఖీ చేశారుఅందుబాటులో ఉన్న అత్యవసర వైద్య పరికరాల పనితీరును, మందుల నిల్వలను, వాటి గడువు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి వాహనం అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా రోగుల నుంచి సమాచారం అందిన వెంటానే ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకొని, రోగులకు అవసరమైన ప్రథమ చికిత్స అందిస్తూ సురక్షితంగా ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు.ఆయనతో పాటు చెలిమెల మల్లేశం,పైలట్ అతిఫ్ అలీ మారంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఏకాదశి కార్యక్రమాలు

ఖమ్మం, నవంబర్ 4 (వాయిస్ టుడే): ఖమ్మం బ్రాహ్మణ బజార్ శ్రీబునీల సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నేడు (గురువారం)ఏకాదశి సందర్భంగా సాయంకాలం విష్ణు సహస్రనామాల సంకీర్తన, ఊంజల సేవ కార్యక్రమం జరుగనున్నందువల్ల , భక్తులు విశేషంగా పాల్గొనాలని, స్వామి ఆశీస్సులు పొందాలని, ఈ ఏకాదశి కార్యక్రమాలలో, పద్మనాభం, ప్రమీల, శ్రీను, ఉషా, హనుమంతరావు, రాజ్యలక్ష్మి, రమేష్ బాబు, ప్రసన్న లక్ష్మీ, లతోపాటుగా ప్రతీ ఏకాదశి నాడు సహస్రదీపాలంకరణ సేవలో లాయర్ రంగారావు, ప్రభావత్ పాల్గొంటున్నారని , అధిక సంఖ్యలో భక్తులు వచ్చి విష్ణు సహస్రనామాలు చదివి పాటలు పాడి తీర్థ ప్రసాదములు తీసుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని, యధావిధిగా ఆలయ అర్చకులు శేషు కుమార్, శ్రీనివాస చార్యుల సేవలు కొనసాగనున్నాయని, కార్యనిర్వహకురాలు సరోజినీ అమ్మ ప్రకటించారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపు అత్యంత అవసరం

- స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించిన ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) నవంబర్ 04 నిర్మల్: రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్వర్ణ ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని, నీటి నిల్వలను పరిశీలించారు. భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించాలని కోరారు. అదేవిధంగా రానున్న వర్షాకాలంలో ప్రాజెక్టులో నీటి నిల్వలు పెంచుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగించడం, కాలువల మరమ్మతులు చేపట్టడం, గేట్లు, ఇతర నిర్మాణాల నిర్వహణ పనులను నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. నీటి పొదుపుతో పాటు నీటి వనరుల పరిరక్షణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సయ్యద్ హైదర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ సీ.హెచ్. వినోద్ కుమార్, స్పోక్స్ పర్సన్ వసంత్ రావు, శ్రీనివాస్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాజిద్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ నియామకం



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా నవంబర్-04, వాయిస్ టుడే: తెలంగాణ రక్షణ సేన బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధికారికంగా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో బీసీ వర్గాల అభ్యున్నతికి, పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీలో సముచిత స్థానం కల్పించడంతో పాటు, జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీలో చేరిన అనంతరం ఆయనకు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది.జిల్లాలో పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీసీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ జిల్లావ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన పార్టీ అధిష్ఠానానికి, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు, జిల్లా నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌టీసీ కండక్టర్ ప్రవళిక మృతి బాధాకరం

మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి
మున్నూరు కాపు సంఘం పటేల్స్ అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్



హైదరాబాద్, నవంబర్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆర్‌టీసీ కండక్టర్ ప్రవళిక మృతి అత్యంత బాధాకరమని మున్నూరు కాపు సంఘం పటేల్స్ అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగిపై జరిగిన దాడి, అనంతరం ఆమె మృతి చెందడం కలచివేసిందని పేర్కొన్నారు. బస్సులో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ ప్రయాణికురాలు కిందకు తోసివేయడంతో తీవ్రంగా గాయపడిన ప్రవళిక, పది రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 3న రాత్రి మృతి చెందడం విషాదకరమన్నారు.

ప్రజలకు సేవలందించే ఆర్‌టీసీ ఉద్యోగులకు విధి నిర్వహణ సమయంలో తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కొండ దేవయ్య పటేల్ అన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం, ఆర్‌టీసీ యాజమాన్యం ఆదుకోవాలని, తగిన ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రవళిక మృతి పట్ల మున్నూరు కాపు సంఘం పటేల్స్ తెలంగాణ తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని, ఆమె కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రవళిక ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవంబర్‌లో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ మంత్..
అవగాహన పోస్టర్లు ఆవిష్కరించిన సైబరాబాద్ సీపీ

సైబరాబాద్, నవంబర్ 4: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ సూచించారు. డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవల వినియోగంలో వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని కోరారు. నవంబర్ 2026ను సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ పుష్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద లింక్‌లు, తెలియని ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. నకిలీ పెట్టుబడి ఆఫర్లు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో చేసే సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియా ఖాతాలకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఏర్పాటు చేసుకోవాలని, పిల్లలకు ఆన్‌లైన్ వేధింపులు, గేమింగ్ మోసాలు, నకిలీ ప్రొఫైల్స్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, ఎఫ్ఐఎఫ్ఐఎఫ్ఐఎఫ్ఐఎఫ్.స్వర్ణశేఖ.అఐ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీపీ పిలుపునిచ్చారు.



23వ రోజుకు చేరిన NHM ఉద్యోగుల నిరవధిక సమ్మె

అంబేద్కర్ సంఘాల సంఘీభావం

రాజన్న సిరిసిల్ల జిల్లా,నవంబర్ 4(వాయిస్ టుడే): తెలంగాణ లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎనీవీ) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరింది. ఉద్యోగ భద్రత, క్రమ బద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం వంటి డిమాండ్ల నెరవేర్పు కోసం ఉద్యోగులు శాంతియుతం గా ఆందోళన కొనసాగిస్తున్నారు. అంబేద్కర్ సంఘాల మద్దతుఈ సందర్భం గా అంబేద్కర్ సంఘాల నాయకులు, కార్యకర్తలు సమ్మె వేదికకు చేరుకుని ఎనీవీ ఉద్యోగు లకు ఘన సంఘీభావం తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థకు అంకిత భావం తో సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఉద్యోగులకు అండగా నిలబడ తామని వారు భరోసా ఇచ్చారు.యముడి వేషంలో ప్రత్యేక నిరసన,ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉద్యోగులు యముడి చిత్రరూపంలో వేషధారణతో ప్రత్యేక నిరసన నిర్వహించారు. తమ డిమాండ్లపై తక్షణ స్పందన అందించాలని ప్రభుత్వానికి స్పష్టంగా డిమాండ్ చేశారు. ఈ వినూత్న నిరసనతో ప్రభుత్వ దృష్టిని ఆకర్షించాలని ఉద్యోగులు భావించారు.ఉద్యోగుల డిమాండ్లుదీర్ఘకాలం గా సేవలం దిస్తున్న ఎనీవీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.

మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కల్పించాలి.కుటుంబ భద్రత, సామాజిక భద్రత వంటి సేవా హక్కులు అమలు చేయాలి. సమ్మె కొనసాగిస్తామంటున్న ఉద్యోగులు,ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఎనీవీ ఉద్యోగులు స్పష్టం చేశారు. కోవిడ్ కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన ఉద్యోగుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలని వారు కోరుతున్నారు. డాక్టర్లు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులతో పాటు వివిధ వైద్య విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
గురువారం 5 నవంబరు 2026

నియోజకవర్గంలో దేవాలయాల నిర్మాణానికి 2 కోట్ల 7 లక్షల రూపాయల నిధుల మంజూరు

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)నవంబర్ 04 : ముధోల్ నియోజకవర్గంలోని దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం రెండు కోట్ల 7 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ టెక్నికల్ సాంక్షన్ ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు. కామోల్ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయ కళ్యాణ మండప నిర్మాణానికి 50 లక్షల రూపాయలు, లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణానికి 35 లక్షల రూపాయలు, అబ్దుల్లాపూర్ గ్రామంలో ముత్యాలమ్మ మహాలక్ష్మి ఆలయాల నిర్మాణాలకు 50 లక్షల రూపాయల నిధులు, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి 22 లక్షల రూపాయల నిధులు, నరసాపూర్ మండలంలోని తురాటి శివాలయానికి 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ టెక్నికల్ అనుమతి ఇచ్చిందన్నారు. ఆలయాల కమిటీలు మ్యాచింగ్ గ్రాంట్ ను చెల్లిస్తే, ప్రభుత్వం టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తుందన్నారు.. ఆలయాల నిర్మాణానికి టెక్నికల్ గా అనుమతి ఇస్తూ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇంచార్జి మంత్రికి కృతజ్ఞతలు చెప్పారు.

మోటార్ కేబుల్ వైర్ దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) నవంబర్ 04 : సోన్ మండల్ కడ్తాల్ గ్రామం మరియు చుట్టూ ప్రక్కల గ్రామాలలో మోటార్ కేబుల్ వైర్ దొంగతనానికి పాలపడిన ఇద్దరు వ్యక్తులని గ్రామస్తులు పట్టుకొని పోలీస్ వారికి అప్పగించినారు ఇట్టి విశయం లో సోన్ పోలీస్ వారు కేసు నమోదు చేసుకొని వారిని రిమాండ్ కి తరలించడం జరిగినది.

కేసు వివరాలు : కుంచపు లక్ష్మణ్ ం/శి ఎల్లయ్య, వయస్సు : 23 సం, కులము: వడ్డెర, వృత్తి: కూలీ, తీ/శి న్యూ బొప్పారం మరియు గుపాల్వాడ్ శ్రీనివాస్ ం/శి హనుమంతు వయస్సు : 26 సం, కులము: నాయకపోడ్, వృత్తి: కూలీ, తీ/శి వేల్పూర్ గ్రామం నిజామాబాద్ జిల్లా అను ఇద్దరు ఇది వరకే చాలా దొంగతనం కేసులల్లో జైల్ కి వెళ్ళి తిరిగి బయటకి వచ్చి నిన్న తేదీ: 03.11.2026 రోజున కడ్తాల్ గ్రామా శివారులో గల సరస్వతి కెనాల్ లో రైతులు పెట్టుకున్న మోటార్ కేబుల్ వైర్ దొంగతనం చేస్తుండగా పోలం యజమాని అయిన గుర్రం లింగన్న చూసి ప్రక్క పోలంలో గల మరో ఇద్దరు రైతుల సహాయం వారిని పట్టుకొని పోలీస్ వారికి అప్పగించినారు



అదనంగా రెండు శాతం రిజర్వువేషన్ కేటాయించాలి

రాయికల్ (వాయిస్ టుడే) : రాయికల్ అంబెడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు ఇట్టి సందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో 2025 ఏప్రిల్ 14న అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ను తిరస్కరించి ఎస్సి వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చారని . ఈ చట్టం వలన మాలలకు ఒక రోస్టర్ పాయింట్ లేకుండా పోయింది. అని ప్రస్తుతం రోస్టర్ విధానం వలన మాలలు విద్యా, ఉద్యోగాలతో పాటు ప్రమోషన్లు కోల్పోతున్నారు. మాకు జరిగిన సామాజిక అన్యాయాన్ని మీ దృష్టికి తీసుకవస్తున్నాం అని .తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రిజర్వేషన్ లకు ఒక శాస్త్రీయ విధానం లేదని మేము భావిస్తున్నాము. వాస్తవానికి తెలంగాణలో ఉన్న జనాభాలో మూడవ స్థానంలో ఉన్న మాలలకు జనాభా దామాషా ప్రకారం ఒక కుంటి సాకుతో ముడిపెట్టి కేవలం 5 శాతం రిజర్వేషన్లు కట్టబెట్టారు, మాలలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తొక్కేయ్యడానికి కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి జనాభా దామాషా అనే కుంటిసాకుతో కుట్రపూరితంగా వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చి మాలలకు రిజర్వేషన్లు లేకుండా చేశారని మేము భావిస్తున్నాము.అని రిజర్వేషన్ కేటాయింపులలో అన్ని సామాజిక వర్గాలకు ఓకే న్యాయ సూత్రం ఉండాలి. కానీ 'జనాభా దామాషా' అనే కుంటిసాకును మాలలకు మాత్రమే వర్తింపచేశారు. దీనివలన మాలలు రిజర్వేషన్లు కోల్పోతున్నారు. అని తక్షణయే ప్రభుత్వం అదనంగా మరో రెండు శాతం రిజర్వువేషన్ పెంచి రోస్టర్ పాయింట్ లు కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చెంగలి గంగాధర్ ,పుర్రె శ్రీనివాస్ ,ముక్కెర శ్రీనివాస్ , ముక్కెర ప్రసాద్ ,బురం గంగరాజం ,కళేశ్వరం రవి ,బైరి రాజేందర్ ,అచ్చ స్వామి ,కొండ కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



సాదుల నగర్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మి కృష్ణ

నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామంలో బుధవారం నాడు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సాదుల నగర్ సర్పంచ్ లక్ష్మి కృష్ణ ప్రారంభించారు ఈ సందర్భంగా సదుల నగర్ సర్పంచ్ లక్ష్మీ కృష్ణ ఉపసర్పంచ్ పల్లవి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సిఎస్ఆర్ పండు నుండి ఆర్థిక సహకారం అందిస్తున్న వేక పరిశ్రమ యజమాన్యానికి పరిశ్రమ ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి కృష్ణ. ఉప సర్పంచ్ పల్లవి ప్రసాద్ సాదుల నగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి విక్రాంత్ రెడ్డి గ్రామపంచాయతీ సభ్యులు బాసాడపు శ్రీ వాణి శ్రీకాంత్ గౌడ్ మంగలి నాగరాజు మంగాపురం అమృత వెంకటేశం గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుఫాను దెబ్బకు నేలకొరిగిన పంటలు.. రైతన్నకు తీరని నష్టం

సోంపల్లిలో మురసు తుఫాను బీభత్సం.. నేలకు ఒరిగిన వరి, పత్తి పంటలు

పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపం.. ఆందోళనలో అన్నదాతలు

పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



బూర్గంపహాడ్, 4 నవంబర్ (వాయిస్ టుడే): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతన్నకు ప్రకృతి మరోసారి కన్నీళ్లు మిగిల్చింది. మురసు తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలు,వీచిన ఈదురుగాలుల కారణంగా బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామ పరిధిలో వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.పచ్చని పొలాల్లో కళకళలాడాల్సిన పంటలు గాలుల ధాటికి నేలకొరగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఒక్కసారిగా నేలపాలు కావడంతో పెట్టిన పెట్టుబడులు ఎలా తిరిగి వస్తాయోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గాలుల ధాటికి నేలవాలిన వరి..

సోంపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో సాగు చేసిన వరి పంట మురసు తుఫాను ప్రభావానికి తట్టుకోలేక నేలకు ఒరిగిపోయింది.కంకులు వేసి పంట కోతకు సిద్ధమవుతున్న సమయంలో బలమైన గాలులు వీయడంతో వరి పైరు మొత్తం వాలిపోయింది.నేలపై పడిపోయిన వరి కంకులు తడిసిపోవడం, ధాన్యం రంగు మారడం, గింజలు మొలకెత్తే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.పంట కోతకు కూలీల ఖర్చులు పెరగడంతో పాటు, నేలకొరిగిన వరిని కోయడం కూడా రైతులకు అదనపు భారంగా మారనుంది.

పత్తి రైతులకూ తప్పని కష్టాలు..

వరి పంటతో పాటు పత్తి సాగు చేసిన రైతులు కూడా తుఫాను ప్రభావంతో నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈదురుగాలుల కారణంగా పత్తి మొక్కలు వంగిపోవడం, కొన్ని చోట్ల నేలకు ఒరగడం, కాయలు దెబ్బతినడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి.ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టిన రైతులకు ప్రకృతి వైపరీత్యం రూపంలో మరో దెబ్బ తగిలింది.పంట దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత దెబ్బతినే అవకాశం ఉండటంతో పత్తి రైతులు దిగులు చెందుతున్నారు.

అప్పులు చేసి సాగు.. ఆదుకునేది ఎవరు?

వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు.పంటలు బాగా పండితే అప్పులు తీర్చి కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చని ఆశించారు.అయితే పంట చేతికొచ్చే సమయంలో తుఫాను రూపంలో ప్రకృతి విరుచుకుపడటంతో వారి ఆశలు ఆవిరవుతున్నాయి.ఒకవైపు సాగు ఖర్చులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు రైతులను కోలుకోలేని పరిస్థితికి నెట్టే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి.. నష్టపరిహారం అందించాలి!

సోంపల్లి గ్రామంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని, రైతుల కష్టాన్ని గుర్తించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సోంపల్లి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పంటలు నేలకొరిగాయి.. రైతుల ఆశలు కూలిపోయాయి.. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్నదాతలను ఆదుకుంటారా? అనేది వేచి చూడాల్సిందే!



బాధిత కుటుంభ సభ్యులను పరామర్శించిన మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) నవంబర్ 04 : బడ్గావ్ గ్రామానికి చెందిన సాయినాథ్ అనారోగ్యంతో మృతి చెందారు,తానూర్ కు చెందిన షిండే గజానంద్ మరియు కుప్తి గ్రామానికి చెందిన మోర్ సురేఖబాయి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ వారి నివాసానికి వెళ్లి, కుటుంభ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబానికి ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు.

నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరోపణలు

తల్లి చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందంటూ కుమారుడు చెర్రీ ఆర్ట్స్ ఆవేదన



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) నవంబర్ 04 నిర్మల్ జిల్లా :ఖానాపూర్, శ్రీ రామనగర్ కాలనీ: నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో తన తల్లి చికిత్స సందర్భంగా సరైన వైద్య సేవలు అందలేదని ఖానాపూర్ శ్రీరామనగర్ కాలనీకి చెందిన చెర్రీ ఆర్ట్స్ ఆరోపించారు. తన తల్లి జంగాల రాధకు మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని ఆయన కోరారు.

చెర్రీ ఆర్ట్స్ తెలిపిన వివరాల ప్రకారం, జంగాల రాధకు జ్వరం రావడంతో తొలుత ఖానాపూర్ నుంచి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపించారు. రాధకు ప్లేట్లెట్స్ తగ్గిపోయాయని వైద్యులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ ఆసుపత్రికి చేరుకున్న తర్వాత ప్లేట్లెట్స్ పరీక్ష కోసం రక్త నమూనా తీసుకోలేదని, ల్యాబ్ మిషన్ పనిచేయడం లేదని సిబ్బంది చెప్పినట్లు చెర్రీ ఆర్ట్స్ ఆరోపించారు. ఒక రోజు గడిచినా సరైన పరీక్షలు జరగలేదని, గ్లూకోజ్ మాత్రమే అందించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో మెట్ల వద్ద చీకటి, పగిలిన కిటికీ అద్దాలు, కనీస సౌకర్యాల లోపం కనిపించాయని ఆయన తెలిపారు. తమ సమస్యను వైద్యులు, నర్సులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆసుపత్రి పరిస్థితులను వీడియో తీస్తున్న సమయంలో తన ఫోన్ లాక్కొని, వీడియో తొలగించాలని ఒత్తిడి చేశారని కూడా వెల్లడించారు.

ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని చెర్రీ ఆర్ట్స్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులే పేదవాడికి చివరి ఆశ. మాకు కావలసింది గొడవ కాదు న్యాయం. విమర్శలు కాదు మెరుగైన వైద్యం. హామీలు కాదు తక్షణ చర్యలు" అని చెర్రీ ఆర్ట్స్ పేర్కొన్నారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆరుతడి పంటల సాగుతోనే రైతులకు భరోసా

---విద్యుత్ కొరత లేదు నాణ్యమైన సరఫరా

-----రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ

-----ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా నవంబర్-04 వాయిస్ టుడే: రైతుల ఆదాయాన్ని పెంపొందించి వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. భవిష్యత్తులో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలని సూచించారు.బుధవారం సుల్తానాబాద్‌లో వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై ఆరుతడి పంటల విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని, రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.వేసవి పంటలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నీటి విడుదల కోసం విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు ఎనిమిది నియోజకవర్గాలకు సాగునీరు విడుదల కావడంతో చెరువులు, కుంటలు, బావుల్లో నీటి నిల్వలు పెరిగాయని వివరించారు.పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో సుమారు ఇరవై నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, చివరి తడికి నీరు అందక పది వేల ఎకరాల వరకు పంట నష్టపోయే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి సాగుపైనే ఆధారపడకుండా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. పండించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలు, సింగిల్ విండో కొనుగోలు కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్లలో విక్రయించుకునే అవకాశం ఉందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, కరువు ప్రభావంపై క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, చిలుక సతీష్, కళ్లే పల్లి జానీ, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్ లు చింతల రాజు, అమిరి శెట్టి శ్రావణి రాకేష్, వర ప్రదీప్, టీకే ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు ధన్నాయక్ దామోదర్ రావు, సాయిరి మహేందర్, పన్నాల రాములు, అమిరి శెట్టి రాజలింగం, విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఓదెల సంపత్, మండల వ్యవసాయ అధికారి పైడితల్లి,కాట్నపల్లి సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్, గట్టపల్లి సర్పంచ్ గుండేటి దేవేందర్, కర్రె గట్టయ్య,ఏరుకొండ రమేష్, కాంపల్లి సతీష్, స్పోర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్ ముస్త్యాల రవీందర్, ఉప సర్పంచ్, నవీన్, సొసైటీ సంఘ కార్యదర్శి బూరుగు సంతోష్, ఆరేపల్లి రాజు, శ్యామ్, కుమార్, కాంగ్రెస్ నాయకులు పల్లె శ్రీనివాస్, మెంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు..

అడిషనల్ సెషన్స్ కోర్టు మంజూరు చేయాలి

బార్ అసోసియేషన్ విజ్ఞప్తి

(భద్రాచలం, నవంబర్ 04) భద్రాచలంలో అడిషనల్ సెషన్స్ కోర్టు మంజూరు చేయాలనీ బార్ అసోసియేషన్ హైకోర్టు న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ కె.సృజన, ములుగు జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్ లను బుధవారం భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం సమర్పించింది. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజలు, స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు, కోర్టుల్లో పేరుకుపోతున్న కేసుల తీవ్రతను గౌరవ న్యాయమూర్తులకు సవివరంగా వివరించారు.

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా భద్రాచలం ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్‌గా సేవలందించిన న్యాయమూర్తి నల్గొండ జిల్లా జువైనల్ కోర్టుకు బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీగా మారిందని భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. నిత్యం పెద్ద సంఖ్యలో క్రిమినల్ కేసులు నమోదయ్యే ఈ ఏజెన్సీ ప్రాంతంలో మేజిస్ట్రేట్ లేకపోవడంతో కేసుల విచారణ నిలిచిపోయి, పేద గిరిజన ప్రజలు మరియు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కావున భద్రాచలం ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే సుదూర ఏజెన్సీ మండలాలైన చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, మణుగూరు, పినపాక ప్రాంతాలకు కేంద్ర బిందువుగా ఉన్న భద్రాచలం కోర్టులో ప్రస్తుతం మొత్తం 2,422 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గౌరవ జడ్జిల దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ఐపిసి, బిఎన్ఎస్ క్రిమినల్ కేసులతో పాటు చెక్ బౌన్స్, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఎక్సైజ్, ఎన్‌డిపిఎస్ కేసుల సంఖ్య అధికంగా ఉందన్నారు. భద్రాచలంలో సెషన్స్ కోర్టు



లేకపోవడం వల్ల ప్రాథమిక విచారణల (PRC) కోసం, బెయిల్ దరఖాస్తుల కోసం గిరిజనులు, వ్యవసాయ కూలీలు 100 నుండి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెం లేదా ఖమ్మం జిల్లా కోర్టులకు వెళ్లాల్సి వస్తోందని, ఇది ఆర్థికంగా మరియు సమయం రీత్యా వారికి తీవ్ర భారం అవుతోందని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం సత్వర న్యాయం పొందే హక్కును కాపాడటానికి భద్రాచలంలో కొత్తగా అడిషనల్ సెషన్స్ కోర్టును మంజూరు చేసి ఏర్పాటు చేయాలని కోరారు.



అంతేకాకుండా, ఏటూరునాగారం కేంద్రంగా జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జేఎఫ్‌సీఎం) కోర్టును మంజూరు చేసి ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ గారికి ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. ఈ విజ్ఞప్తులపై గౌరవ న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించినట్లు బార్ అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొడాలి శ్రీనివాసన్, హైకోర్టు న్యాయవాదులు పి.వి. కృష్ణమాచారి, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సభ్యులు ఎక్కడ మందడపు శ్రీనివాసరావు,నల్లమోతు రాము, దాగం ఆదినారాయణ, ముత్యాల ప్రవీణ్ మరియు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు!

ఉద్యోగానికి ఎగనామం. 2.5 ఏళ్లుగా 'టీచర్' గైర్హాజరు!అధికారులు నిద్రమత్తు వీడకపోతే డిఇఓ ఆఫీస్‌ను ముట్టడిస్తాం: స్ ఫ్ ఐ ఎ ఐ పి స్ యూ హెచ్చరిక



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) నవంబర్ 04 నిర్మల్/ముధోల్: ప్రభుత్వ ఉద్యోగం అంటే బాధ్యత మరచి ప్రవర్తించడం కాదని, విధులను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకునే ఉద్యోగులకు తగిన బుద్ధి చెబుతామని స్ ఫ్ ఐ మరియు ఎ ఐ పి స్ యూ విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. ముధోల్ మండలం వెంకటాపూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుని సుదీర్ఘ గైర్హాజరుపై విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డి ఈ ఓ) గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్ ఫ్ ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి దిగంబర్ మరియు ఎ ఐ పి స్ యూ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ సంయుక్తంగా మాట్లాడుతూ... వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, ఒక ఉపాధ్యాయుడు గత రెండున్నర సంవత్సరాలుగా (2.5 ఏళ్లు) విధులకు హాజరుకాకుండా బాధ్యతారాహిత్యంగా సుదీర్ఘ లీవ్‌లో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా, బాధ్యత మరచి విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఇలాంటి ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.

స్థానిక మండల విద్యాశాఖ అధికారి (ఎం ఇ ఓ)ని వివరణ కోరగా, "టీచర్‌కు జీతం రావడం లేదు, ఆయన లీవ్‌లో ఉన్నాడు" అని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పడంపై మండిపడ్డారు. జీతం రాకపోవడం సమస్య కాదని, రెండేళ్లకు పైగా విద్యార్థులకు బోధన అందకుండా పోవడం అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

మా డిమాండ్లు:

1. కఠిన చర్యలు: గత 2.5 ఏళ్లుగా విధులకు రాకుండా గైర్హాజరవుతున్న ఉపాధ్యాయునిపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి ఉద్యోగం నుండి రద్దు/సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలి.

2 , వెంటనే టీచర్ కేటాయింపు: వెంకటాపూర్ పాఠశాలకు వెంటనే మరొక ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై కేటాయించి విద్యాబోధనను పునరుద్ధరించాలి.

ఉన్నతాధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే, విధులకు గైర్హాజరవుతున్న సదరు టీచర్‌తో పాటు సంబంధిత అధికారుల తీరుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



అకాల వర్షాలతో, తుఫాన్ తీవ్ర తాకిడితో భారీగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేలా, పంట నష్టాన్ని అంచనా వేయాలి

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల

వర్షంలోనే పాల్వంచ మండలంలో కొత్వాల విస్తృత పర్యటన

పాల్వంచ తహశీల్దార్‌తో వరద తీవ్రత వివరించిన కొత్వాల

పాల్వంచ మండలం నవంబర్ 4 (వాయిస్ టుడే) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం తుఫాన్ తీవ్ర తాకిడితో అకాల వర్షాలతో భారీగా పంటలు నష్టపోయిన రైతాంగాన్నిలి ఆదుకునేలా వ్యవసాయ శాఖాధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫ్డ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా పడుతున్న వర్షాలతో పాల్వంచ మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల పంటలు నీట మునిగి రైతాంగం భారీగా నష్టపోయింది. బుధవారం పాల్వంచ మండలంలోని లిదంతెలబోర, బంద్రు గొండ, దంతెలబోర ఎస్సీ కాలనీ, సంగం, నారాయణరావుపేట, నాగారం, జగన్నాధపురంలి గ్రామాల్లో లివ్యవసాయ శాఖాధికారులతోలి కలిసి లికొత్వాలలి విస్తృతంగా పర్యటించారు. లిదంతెలబోర, బంద్రు గొండలి గ్రామాల్లో ఎర్ర చెరువు, బసవారెడ్డి చెరువు అలుగుపడి, వరి పంటలు మునిగి ఆ ప్రాంతమంతా జలమయమైంది. లికొత్వాలలి అన్ని గ్రామాల్లో పర్యటించి, లివ్యవసాయ శాఖాధికారులకు పంట నష్టాన్ని చూపించారులి . ఈ సందర్భంగా లికొత్వాలలి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న రైతాంగానికి ఈ తుఫాన్ తో లి"మూలిగే నక్కపై తాటి పండు పడిన"లి చందంగా తయ్యారైందన్నారు. లివ్యవసాయ శాఖాధికారులు వర్షాలు తగ్గిన వెంటనే గ్రామాల్లో పర్యటించి, పంట నష్టాన్ని అంచనా వేసి, ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదికలులి పంపాలన్నారు. రైతాంగం, గ్రామ ప్రజలు తుఫాన్ ప్రభావానికి అప్రమత్తంగా ఉండాలని లికొత్వాలలి అన్నారు. ఈ కార్యక్రమంలో లిమండల వ్యవసాయ శాఖాధికారి పి. శంభోశంకర్, ఎ.ఇ.ఓ. సత్యం, సొసైటీ డైరెక్టర్ చౌగాని పాపారావు, నారాయణరావు పేట పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్న గౌడ్, బూసి శీనులి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి సేవలకు దక్కని గౌరవం

ఎట్టి చాకిరి చేస్తున్న నిందలు బెదిరింపులే

ఏళ్ళు గడుస్తున్నా నెరవేరని డిమాండ్లు

రాయికల్(వాయిస్ టుడే): అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది అంటే కొందరికి చిన్నచూపు వచ్చేది తక్కువ జీతం చేసేది నిబద్ధత ఉద్యోగం అయిన అడుగడుగున ప్రశ్నలు బెదిరింపులు అవమానాలు ఎదుర్కొంటున్నారు అయినా లిబ్రతుకుతెరువు కోసం బడిపంతులు అన్న చందంగాలి వీరి జీవితం సాగుతుంది,చిన్నారుల్లో బాలింతలలో పోషక ఆహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అంగన్వాడి కేంద్రాల టీచర్లు ఆయాలు ఆరోగ్య గ్రామ నిర్మాణంలో వీరి పాత్ర అనిర్వచనీయం బాలింతలకు మోతాదుకు తగ్గట్టు పోషకాహారం పంపిణి చేస్తు చిన్నారి విద్యార్థులకు చదువు చెప్పడంతోపాటు పోషకాహారం ఇస్తు గ్రామల విద్యాభివృద్ధికి దోహదం చేస్తున్నారు .





టి యు డబ్ల్యూ జే రాష్ట్ర కార్యవర్గ సమావేశం

హైదరాబాద్ (వాయిస్ టుడే) నవంబర్ 05:- హైదరాబాదులోని బిహెచ్ఈఎల్ లోని హోటల్ శుభంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విరహత అలీ అధ్యక్షత వహించగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి గారు కార్యదర్శి రామనారాయణ గారు యూనియన్ జాతీయ నాయకులు కుంజేటి సత్యనారాయణ గారు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావుగారు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోలా నాగేశ్వరరావు,బంటు కృష్ణ గారు పాల్గొన్నారు. 6 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు అంశాలపై చర్చ జరిగింది పోరాటాలకు కార్యాచరణ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు అక్రిడేషన్ కార్డుల మంజూరి విషయాల్లో సమావేశం సంతృప్తిని వ్యక్తం చేసింది కార్యదర్శి నివేదికపై సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ హర్షం వ్యక్తం చేసింది.



సిద్దాపూర్‌లో ఘనంగా చిన్నారుల నూతన వస్త్రధారణ కార్యక్రమం

జహీరాబాద్ వాయిస్ టుడే నవంబర్ 04: ఝరాసంగం మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో శ్రీమతి శ్రీ స్వప్న సుభాష్ దంపతుల కుమార్తె, కుమారులు చి. అఖిల్, చి. నిఖిల్, చి. అక్షయ ల నూతన వస్త్రధారణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. పూలతో అందంగా అలంకరించిన వేదికపై గ్రామ పెద్దల సమక్షంలో చిన్నారులకు నూతన వస్త్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దాపూర్ గ్రామ పెద్దలు పి. భద్రారెడ్డి, టి. నర్సింలు, పాపయ్య, పి. రవీందర్ రెడ్డి, టి. సంగమేష్, టి. విష్ణు, సురేష్, పెంగన్ న్యూస్ పేపర్ సీఈఓ నర్సింలు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



నవంబర్ 5 నుండి 11 వరకు పి.డి.ఎస్.యు విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభలు

సూర్యాపేట జిల్లా వాయిస్ టుడే ప్రతినిది నవంబర్ 5: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు, రంగవల్లి తదితర ఎందరో విద్యార్థి యువకిశోరులు శాస్త్రీయ విద్యా సాధన కోసం, సమసమాజ స్థాపన కోసం పోరాడుతూ హిందూ మతోన్మాద మూకల దాడుల్లో, రాజ్యం నిర్వహించిన బూటకపు ఎన్‌కౌంటర్లలో తమ ప్రాణాలను ఈ సమాజం కోసం తృణప్రాయంగా అర్పించారని అన్నారు.జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి అమరత్వానికి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వారి త్యాగాలను స్మరించుకుంటూ అమరత్వ స్ఫూర్తి పతాకాన్ని ఎత్తిపడదామని పిలుపునిచ్చారు. విద్యార్థి అమరవీరుల త్యాగాలు నేటి విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకమని, వారు కన్న కలల సమసమాజ స్థాపన కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని అన్నారు.అదేవిధంగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ꟻ×=)ను రద్దు చేయాలని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపన కోసం విద్యార్థి యువతరం ముందుకు రావాలని కోరారు.కావున నవంబర్ 5 నుండి 11వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో విద్యార్థి అమరవీరుల వర్ధంతి, సంస్మరణ సభలను విస్తృతంగా నిర్వహించి, వారి త్యాగాలను స్మరించుకోవాలని పి.డి.ఎస్.యు జిల్లా కార్యవర్గం విద్యార్థి లోకానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు సృజన, సంధ్య, అఖిల, నవ్య, రమ, మహేష్, నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జువెలరీ షాపులో దొంగతనం.!

నిందితుడి అరెస్టు.. నాలుగు తులాల బంగారం స్వాధీనం

మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 04 : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం షాపులో చోరీ చకచక్యంగా పట్టుకున్న పోలీసులు వివరాల్లోకి వెళితే బోడుప్పల్‌లోని వీరారెడ్డి నగర్ ఎక్స్ రోడ్ వద్ద గల రాందేవ్ జువెలరీ షాపునకు ఒక వ్యక్తి కస్టమర్‌గా వచ్చి, షాపు యజమాని తన పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో అతని దృష్టిని మరల్చి, షాపులో ఉన్న బంగారు ఇయర్ రింగులను దొంగిలించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.ఈ ఘటనపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు మరియు ఇతర సమాచారాన్ని సేకరించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. విచారణలో నిందితుడు తన ఆర్థిక ఇబ్బందులు మరియు అప్పుల కారణంగా ఈ దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడించాడు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించబడిన సుమారు 4 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేయడం జరిగింది. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించడం జరిగిందని,ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించబడిన బంగారాన్ని రికవరీ చేయడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులను మరియు సిబ్బందిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, డీసీపీ ఉప్పల్, ఏసీపీ ఉప్పల్ అభినందించారు.

జువెలరీ షాపుల యజమానులు అప్రమత్తంగా ఉండాలి..

షాపులలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, కస్టమర్లకు బంగారు ఆభరణాలు చూపించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మేడిపల్లి సిఐ డి. జలంధర్ రెడ్డి తెలిపారు.

VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - విజయ కోసం..
ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
గురువారం 5 నవంబరు 2026



జాతీయ సామాజిక భద్రతా బోర్డు సభ్యుడిగా విశ్రాంత ఈపీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్ జాలిగం

హైదరాబాద్, నవంబర్ 04: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ల కింద, కేంద్ర కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి అధ్యక్షతన నూతనంగా ఏర్పాటైన 'జాతీయ సామాజిక భద్రతా బోర్డు' సభ్యుడిగా రిటైర్డ్ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీనివాస్ జాలిగం నియమితులయ్యారు. సామాజిక భద్రత, ఈపీఎఫ్ రంగాలు మరియు కార్మిక సంక్షేమ అంశాలలో ఆయనకున్న అపారమైన అనుభవం, నైపుణ్యానికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. శ్రీనివాస్ జాలిగం జాతీయ బోర్డు సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల తెలంగాణ ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణారావు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా బరకత్‌పురలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ.. సరైన వ్యక్తికి సరైన స్థానంలో అర్హత లభించిందని కొనియాడారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు, వారి సామాజిక భద్రతపై శ్రీనివాస్ జాలిగంకు సుదీర్ఘ అనుభవం, స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. జాతీయ బోర్డులో ఆయన ప్రాతినిధ్యం వహించడం వల్ల అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇది దేశంలోని లక్షలాది మంది అసంఘటిత కార్మికులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్‌టీసీ కండక్టర్ ప్రవళిక మృతిపై ఎస్‌డబ్ల్యూయూ సంతాపం



హైదరాబాద్, నవంబర్ 04: ఆర్‌టీసీ కండక్టర్ ప్రవళిక మృతి చెందడం అత్యంత హృదయవిదారకమని ఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూయూ (ౖుజ ూజొఖ) వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిశాల అబ్రహం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ (×చీఖజ) భవన్, ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ప్రవళిక మృతిపట్ల సంతాప సభ నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రవళికను బస్సులోని ఒక ప్రయాణికురాలు కిందకు తోసివేయడంతో తీవ్రంగా గాయపడిన ఆమె, గత పది రోజులుగా ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి నవంబర్ 3న రాత్రి తుదిశ్వాస విడిచారని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న మహిళా ఉద్యోగిపై ఇటువంటి దాడి జరగడం సమాజంలో మహిళా ఉద్యోగుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అబ్రహం ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ దారుణ ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టీసీ సిబ్బందికి, ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి ఆర్‌టీసీ యాజమాన్యం తక్షణమే ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ప్రవళిక అకాల మరణానికి ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూయూ నేతలు సయ్యద్ మహమూద్, బి. హనుమంతరావు, చంద్రయ్య, విజయబాబు, ఛాయాదేవి, శాంతకుమారి, జయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



సగర (ఉప్పర) కులాన్ని బీసీ-ఎ లో చేర్చాలి

మంత్రి పొంగులేటికి సగర హక్కుల పోరాట సమితి వినతి

హైదరాబాద్, నవంబర్ 04: సగర (ఉప్పర) సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ సగర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సగర ప్రతినిధి బృందంతో కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపేష్ సాగర్ మాట్లాడుతూ.. సగర కులాన్ని బీసీ-డి నుంచి బీసీ-ఎ కేటగిరీకి మార్చాలని, సగర ఫెడరేషన్‌ను ప్రత్యేక ప్రభుత్వ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి చైర్మన్, పాలక మండలిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సగర కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, యువతకు ఉపాధి రుణాలు, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరీష్ సాగర్, గుంటీ నాగేష్ సాగర్, బంగారు నరసింహ, దిండి రామస్వామి, గోపాల్ సాగర్, గుంటీ రవీందర్ పాల్గొన్నారు.



లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలి

'ఉద్యమకారుల యాప్' వెంటనే ప్రారంభించాలి

గన్ పార్క్ వద్ద టీయూ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

హైదరాబాద్, నవంబర్ 04: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందని విమర్శిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూ జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ ఎదుట గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు నిరసన ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘోర సంఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీయూ జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ... తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు నేడు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి రావడం అత్యంత విచారకరమన్నారు. లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యకు బాధ్యత వహిస్తూ ఆయన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు మరియు వివరాల నమోదు కోసం 'ఉద్యమకారుల యాప్'ను వెంటనే ప్రారంభించాలని, రాబోయే డిసెంబర్ 9 నాటికి అర్హులైన ఉద్యమకారులందరికీ తెలంగాణ ఉద్యమ ఫలాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్వర్ పటేల్, అనుముల రవీందర్, మోత్కూరు మల్లేష్, జి. యాదగిరి, రాజుగౌడ్, అంకం సతీష్, శ్రీశైలం, జాంబవ్, కృష్ణ, గిరి, రాజయ్య, అమరేందర్ గౌడ్, వి. అరుణ, లావణ్య, విజయలక్ష్మి, పుట్ట రంజిత్, అమృత్ తో పాటు పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.



ఆర్జేడీ పార్టీ అధ్యక్షులు తేజస్వి యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐఐపీ తెలంగాణ నాయకులు

తాజ్ కృష్ణ హోటల్‌లో మర్రి ప్రభాకర్ ముదిరాజ్, చింతల నీలకంఠం ముదిరాజ్ భేటీ

హైదరాబాద్, నవంబర్ 04: ఆర్జేడీ పార్టీ జాతీయ అధ్యక్షులు తేజస్వి యాదవ్‌ను హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఐఐపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మర్రి ప్రభాకర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల నీలకంఠం ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున శాలువాతో తేజస్వి యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐఐపీ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తేజస్వి యాదవ్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐఐపీ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఇండియా కూటమి బలోపేతం కోసం ఐఐపీ గుప్తా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్టీని విస్తరించే దిశగా తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు. దీనిపై తేజస్వి యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, నాయకుల కృషిని అభినందించారు. రాబోయే రోజుల్లో ఇండియా కూటమి విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి కూటమి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.



డీప్‌టెక్, ఆవిష్కరణలకు తెలంగాణ కేంద్రం

పారిశ్రామిక రంగంలో 8.1 శాతం వృద్ధి.. రూ.3.04 లక్షల కోట్ల జీఎస్‌వీఏ

ఏఐ, క్వాంటం, రోబోటిక్స్, సెమీకండక్టర్లకు ప్రాధాన్యం

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 04: తెలంగాణను ప్రపంచస్థాయి డీప్‌టెక్, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, ఆధునిక తయారీ రంగాల్లో పరిశోధన, సంస్థలు ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. దీబేగంపేటలోని ఐటీసీ కాకతీయలో బుధవారం నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, 'తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్'లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిక్కీ వందేళ్ల ప్రస్థానం దేశ పారిశ్రామిక రంగ పరిణామానికి నిదర్శనమన్నారు.

2025--26లో రాష్ట్ర స్థూల విలువ జోడింపు (జీఎస్‌వీఏ)లో పారిశ్రామిక రంగం 8.1 శాతం వృద్ధితో రూ.3.04 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. రాష్ట్ర వస్తు ఎగుమతులు 39.3 శాతం పెరిగినట్లు తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం ఎమర్జింగ్ టెక్నాలజీలు, పరిశ్రమలు, తయారీ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు సమష్టిగా పనిచేస్తేనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొంటూ.. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ఆవిష్కర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫిక్కీ తెలంగాణ ఛాప్టర్ చైర్మన్ వి.వి. రామరాజు, కో-చైర్మన్ జయదేవ్ మీలా, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షురాలు కె.కె. మహేశ్వరి, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ జాయింట్ ఎండీ సంగీతారెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక టెన్నిస్ కాంప్లెక్స్ ప్రారంభం

క్రీడలకు ప్రోత్సాహమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఖేలో ఇండియా నిర్వహణకు అన్ని శాఖల సమన్వయం అవసరం: మంత్రి పొన్నం



హైదరాబాద్, నవంబర్ 04: ఎల్బీ స్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ బాధ్యతలు దక్కడం గర్వకారణమన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. సీఎం కప్‌తో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో క్రీడా పోటీలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. నిరుపయోగంగా ఉన్న స్టేడియాలను పునరుద్ధరించి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్ ద్వారా తెలంగాణను దేశంలోనే క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. ఖేలో ఇండియా నిర్వహణలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మెట్రో వాటర్ వర్క్స్, పోలీసు తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్రీడా పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లోనూ పోటీలు నిర్వహించాలని, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ వంటి సంస్థలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల క్రీడాకారులకు అవకాశాలు కల్పించాలన్నారు. చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే భావన నుంచి యువత బయటకు రావాలని, క్రీడల్లో ప్రతిభ చూపినా ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో ప్రవేశాలకు అవకాశాలుంటాయని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, నాణ్యమైన శిక్షణతో తెలంగాణకు గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోనీ బాలదేవి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, శంకర్‌గీతా కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**